# బలిదాన్

శ్రీ గుండవరపు దత్తుగారు

తెల్లవారడం తరువాయి కుయ్యిమని ఫ్యాక్టరీ కూత పెడుతుంది. దానితో కూలిపేటలో వుండే పనివాళ్ళంతా ఉలికిపడి లేస్తారు. లేచి ఎక్కడ కక్కడ కాలకృత్యాలు తీర్చుకొని ఒక్కొక్కళ్ళే వీధులలో పడుతారు. కడుపు నిండా కూడుంటే కంటినిండా కునుకుంటుంది. అది లేకపోతే యిదిలేదు. రాత్రి చాలినంతనిద్ర లేకపోవుటచేత అతిబద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ, కళ్లు నలుపుకొంటూ ఈడుపుకాళ్లతో ఫ్యాక్టరికి పోతుంటారు. పనెక్కువై ప్రాణం విసగడంచేత ఒక్కళ్ళనొకళ్ళు వెక్కిరించుకుంటూ, తిట్టుకుంటూ పోవడం మామూలు. ఇది దరిద్రంయొక్క ముఖ్యలక్షణం.

ఫ్యాక్టరి ఆవిరిగొట్టాలు 'బుజ్' మని యీనిర్భాగ్యులకు స్వాగత గీతాలు పాడుతాయి. దినమంతా ఫ్యాక్టరిలో చాకిరి చేస్తారు. సాయత్రం ప్రొద్దు గూకడంతోటే వాలు మొఖాలు వ్రేలాడ వేసుకొని కూలీలంతా ఫ్యాక్టరిలోనుంచి బయట పడుతారు. ఇంజను డ్రైవరు కాలిపోయిన బూడిద తోసివేసినట్లు చెరుకు గానుగ రసం తాగేసి పిప్పిని బయట పారేసినట్లు ఫ్యాక్టరీ అధికారులు యీ కూలీలను గెంటి తాళం వేస్తారు. మసిబారిన మొగాలతో క్రూడాయిలు కంపుకొట్టుకుంటూ అదో విధమైన వెఱ్ఱి సంతోషంతో నవ్వుతూ త్రుళ్లుతూ గూళ్లకి చేరుకుంటూరు. ఏ రోజు కారోజు గడిచింది కదా అనే ధీమా! ఇక ఈ రోజు పని లేదు అనే ధైర్యం. ఎక్కడికక్కడికే తృప్తి.

ఈ లాంటి నిర్భాగ్యజీవనం చేసేవాళ్ళలో 'సుధీల్' ఒకడు. చెయ్యెత్తు మనిషి. బలమైన దేహము మోటుతనము ఎక్కువ, పెద్ద గడ్డము. సుధీల్ కొడుకు రమేష్. పదునారేండ్ల వయస్సు. ఒక్కడే కొడుకు తండ్రి మరణించిన రెండు వారములకు ఒక రోజు సాయంకాలము రమేష్ తప్పతాగి తూలుతూ ఇంటికొచ్చి తన తండ్రి కూర్చునే బల్లమీద కూలబడ్డాడు. తండ్రిలాగే తల్లిని భోజనము తీసుకుని రమ్మనమని కేకేశాడు. ఈ మూర్ఖత్వం చూచి తెల్లపోయింది తల్లి. కుమిలి కుమిలి ఏడ్చింది. ఏమి చేయుటకు తోచలేదు. ఏలాగో ధైర్యం తెచ్చుకుంది. కొడుకు దగ్గరకువచ్చి వీపు తట్టింది. బుజ్జగింపు మాటలతో చెప్పనారంభించింది. 'నాయనా! యిప్పటినుంచి తాగడం ఆరంభిస్తే నీ వింక సంసారం ఏమి నిరవాకం చేస్తావు.' అని అతి దీనంగా అడిగింది.

దానికి జవాబుగా రమేష్ 'అంతా తాగుతున్నారు నేను తాగాను' అని ధీమాగా అన్నాడు. తల్లి నిట్టూర్పు విడిచింది. కూలీలకు కులాసాగా అనందించడానికి సారా దుకాణం తప్ప వేరే స్థలము లేదనే సంగతి ఆమెకు తెలిసిన విషయమే. చివరకు తెగించి 'నాయనా! నువ్వు తాగవద్దు. మీ నాన్న తాగి తాగి నా బ్రతుకింత దుస్థితికి తెచ్చాడు. నువ్వుకూడా తాగితే నా గతేమిటి. నన్ను చూచైనా కొంచెత జాలివహించి ఈ తాగుడు మానేద్దు!' అని చెప్పింది. రాళ్లు కరిగేటంతటి దీన స్వరంతో కొడుకును బతిమాలింది.

ఆమె దీనాలాపము రమేష్ రాతిగుండెను కరిగించింది. రమేష్ తల్లి పొడుగుపాటి స్త్రీలలో లెక్క. చిరకాలము నుండి పడుతూవుండే దెబ్బలతో నడుము వంగిపోయింది. కష్టాలు మనుష్యులను కృంగదేస్తాయికదా! ఆమె లక్షణాలు చూస్తే అతినమ్రస్వభావం కల ఉత్తమ స్త్రీ యని స్పష్టమౌతుంది.

రమేష్ తల్లి కండ్లనుండి సంతతధారగా కారుతున్న కన్నీళ్లను చూచాడు. హృదయంలో పరివర్తన కలిగింది. తాగనని శపథంపట్టాడు.

రమేష్ రోజల్లా ఫ్యాక్టరీలో కష్టపడి పనిచేసేవాడు. ఫ్యాక్టరీలకు పోయి విలాసంగా కాలంగడపడం మానేసాడు. త్రాగుడు వదలిపెట్టేశాడు. ఎప్పుడు ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ వుండేవాడు. తగిన వయస్సు కనుక బహుశా ఏ విలాసవతి ప్రేమ పాశాల్లోనో తగులుకొని బాధపడుతున్నాడేమోనని తల్లికి అనుమానము కలుగునట్లు చేసాడు కూడా కాని "తనొకటి తలచిన దైవ మొకటి తలంచు"నట్లు రమేష్ స్థితి తారుమారు అయింది. "అమ్మా! నేను

చదివే పుస్తకాలు చదువకూడదని ప్రభుత్వ అధికారులు నిషేధించారు. ఈ పుస్తకాలలో మన కూలినాలి జాతి జీవిత స్థితిగతులు ఉన్నవి వున్నట్లు వ్రాయబడియుండుటచేత యివి నిషేధింప బడినాయి. ఇవి రహస్యముగా అచ్చుపడినవి. వీటిని చదువుతూండగా చూశారంటే పట్టుకొని జైలులో పెట్టుతారు. చూచావా మన అవస్థ. నిజము తెలుసుకో ప్రయత్నము చేస్తే జైలుకు వెళ్లవలసి వస్తుంది. యిదీ మన కూలివారి స్థితి" అన్నాడు. జైలు మాట వినేసరికి గుండె గుభేలుమంది. ఊపిరాడలేదు. రమేష్ కేసి దీనంగాచూచింది. "అయితే నాయనా! యీ పనెందుకు చేస్తావు. వూరుకుండే ప్రాణానికి ఉపద్రవం తెచ్చిపెట్టుకోవడమెందుకు. మన పనేదో మనము చూచుకోవచ్చు కదా!" అంటూ గుడ్లలో నీళ్లు కుక్కుకుంది.

"అమ్మా! నీవు కొంచము ఆలోచించిచూడు. నీ బ్రతుకు ఒక బ్రతుకేనా! నీకు నలభై ఏళ్లు పైన బడ్డాయి. ఇంత వరకు ఏమైనా సుఖమనేది ఎలాంగుంటుందో ఎరుగుదువా? ఏ రోజుకారోజు మానాన్న నిన్ను చావబాదని రోజుందా? ఫ్యాక్టరి మీద ఉండే కసి అంతా తీర్చుకొనే వాడు. మా నాన్న యీ ఫ్యాక్టరీలో ముప్పై సంవత్సరములు పని చేశాడు. అతను పని ప్రారంభించి నప్పుడు యీ ఫ్యాక్టరీ అంతా జానెడు బెత్తెడుండేది. రెండే యిళ్లు. కాని యిప్పుడు చూచేవా ఎంతయిందో దగ్గర దగ్గర నాలుగు రెట్లు పెరిగింది. కాని మనకేముంది. సాహెబు సూబా ఎంత ఏలినా బీబికి కుట్టుపోగులేనట్లు మన చేతికి చిప్ప మాత్రమే మిగిలింది. కూలీలు చెమట లూడ్చి చాకిరి చెయ్యడం యజమానులు కాలిమీద కాలేసి కూర్చుని లాభాలు అనుభవించడం. ఫ్యాక్టరీలు పెరుగుతుంటాయి. కూలీలు చస్తూవుంటారు.

"అయితే నాయనా! నీవు చెప్పిందంతా నిజమే కాని యీ దురవస్థను తొలగించుటకేమి మార్గము" అని అడిగింది తల్లి ఆతురతతో. "మార్గాలు తరువాత ఆలోచించవచ్చు. ముందు మన కూలినాలి జనం అందరూ తమ దురవస్థను గురించి తెలుసుకోవాలి గదా" అని రమేష్ జవాబిచ్చాడు.

కాలచక్రం గిర్రున తిరిగింది. రోజులు, వారాలు గడిచిపోయాయి. ప్రతి శనివారం రమేష్ యింట్లో మిత్రులంతా సమావేశమౌతూవచ్చారు. ఈ సమావేశాల మూలంగా ప్రజలలో ఆ రోజుకన్న ఆ రోజు నూతన కళాకాంతులు కనిపిస్తున్నాయి. శనివారపు సమావేశాలలో రమేష్ ధోరణి హెచ్చిపోయింది. ఒక్కొక్క రోజున విసుగు విరామము లేకుండా గంటలకొద్దీ మాటాడేవాడు. ఈ సభలకు పట్నం నుంచి తరుచుగా సులోచన, శశాంక అనే యువతులు వచ్చేవారు. శశాంక మంచి అంగసౌష్టవంకలది. పలుచని ముఖము విశాలమైన కళ్లు కాని ఆమె మాటలలోనూ నడకలోను ఒక మోస్తరు మొగతీరుండేది. ఆమె మాట్లాడు నప్పుడు కనుబొమలూ, ముక్కూ అదిరేది. ఒక రోజు సంభాషణలో "మనం సామ్యవాదులం" (Socialists) అని ఘంటాపదంగా చెప్పింది. శశాంక రమేష్‌తో అప్పుడప్పుడు చిర్రుబుర్రు లాడడం చీవాట్లు పెట్టడం కద్దు కాని రమేష్ మాత్రము అతి దయతో, ఓర్మితో, చిరునవ్వుతో ఎంతో దయగా ఆమె నాదరించే వాడు.

ఇది యిట్లుండగా సభలు జోరు అయినాయి. వారానికి ఒక సభ అల్లా రెండు సభలయ్యాయి. ప్రతి సమావేశంలో రమేష్, శశాంక, సులోచన మొదలగు వారంతా చేప్పే మాటలు వింటుంటే రమేష్ తల్లికి క్రమముగా భయంతగ్గి వారు చెప్పేదంతా సత్యమని తాను యిన్ని రోజులుగా కన్ను మూసుకొని గుడ్డెద్దు చేనులో పడ్డట్లు కాలం గడుపుతున్నట్లు తెలుసుకుంది. ప్రతి సభలోను సామ్యవాద సిద్ధాంతములు ఫ్యాక్టరి కూలీల దినచర్యలలోను ఒడుదుడుకులు గురించి చర్చించేవారు. కాలంగడిచే కొద్ది రమేష్ పలుకుబడి రోజురోజుకి హెచ్చిపోతుంది. పలుకుబడి అధికారులకు అనుమానం కలుగజేసేది. పోలీసులుగాని ఫ్యాక్టరి యజమానులుగాని యెవరికైనా ఏదైన అన్యాయం చేస్తే వెంటనే రమేష్ సలహాకోసం వచ్చేవాళ్ళు. వయస్సుతో పని లేకుండానే రమేష్ ఆ వూరిలో పేరు ప్రఖ్యాతి గడించాడు. అతని పట్టుదల కార్యదీక్ష శ్రద్ధను చూచి ప్రజలు చాల గౌరవించేవారు. యింతెందుకు రమేష్ ప్రజల 'నోటిలో నాలిక' అన్నట్లు ఆయ్యాడు. రమేష్ సలహా లేనిదే ఎవరు ఏ పని చేయరు.

# బ లి దా న్

రమేష్ వున్న వూర్లో ఫ్యాక్టరీ వున్నది. దానికి వెను కాలనే ఒక మురికి గుంట వున్నది. నీరు నిలుచుట చేత దుర్వాసన రావడంకద్దు. పైగా దోమల మూలాన్ని రోగాలు వ్యాపించేవి.

"వినాశకాలే విపరీత బుద్ధి" అను సామెత సార్థకము చేయుటకు వచ్చాడొక ఫ్యాక్టరి మేనేజరు సాబ్. వచ్చీ రావడంతోటే ఒక పాచిక పారేసాడు 'Be as a man or be as an ass but not to pretend either of the two' అన్నారు మన యింగ్లీషు పెద్దలు. కడుపులో గంపెడు దురాలోచనలు పెట్టుకొని పైకి పరమత్యాగిలాగా మొద లెట్టాడు మన మేనేజరు సాబ్. ఫ్యాక్టరీవాళ్ళ నందరిని పిలి పించాడు. యిచ్చాడు ఒక లెక్చరు. ఏమని! గుంటను పూడ్పించుట అవుసరమని. దోమలు మురుగుటచే ప్రజల ఆరోగ్యము చెడుచున్నదని. దోమలను తగ్గించి ప్రజల ఆరో గ్యము బాగుపరచుట తన విధి అని. మరుసటి దినము ఒక ఫర్మానాజారీచేయించాడు. గుంటను పూడ్పించుటకు కూలి నాలి జీతములోనుంచి కొంత భాగము మినహాయిస్తా నని. ఫ్యాక్టరికి ఎంత లాభాలొస్తున్నా గుంటను పూడ్పించ లేక పోయారు మన ఫ్యాక్టరీ భాయీలు. అవును పాపం, "చీమలు పెట్టిన పుట్ట పాముల కిరవైనట్లు" చెమటూడ్చి చాకిరి చేయుట ఒకరి వంతు, సోఫామీద కూర్చొని హుక్కా పీల్చుట, సుఖమనుభవించుట మరియొకరి వంతు. అవును. ఏమి చేస్తాము! కాలవైపరీత్యం.

బయలుదేరింది కలకలము ఫ్యాక్టరీలో. ఆడ, మగ, బీద, సాద అనే విచక్షణలేక సమ్మె చేయుటకు తీర్మానించారు. రమేష్ ఒంట్లో సుస్థిగావుండుటచే ఫాక్టరీకి వెళ్ళలేదు. మంచి నిలకడమీద చెడుగు త్వరగా తెలియుట సహజం. రమేష్ స్నేహితులు ఫ్యాక్టరీలో జరిగిన ఉదంతము సవిస్తర ముగా తెలియ జేసారు మన రమేషుకు. ఆలోచించాడు. తీవ్రంగా ఆలోచించాడు. వచ్చాడు నిర్ధారణకు. ఫ్యాక్టరీకి పోయి చెప్పాడు మన మేనేజరు భాయీతో. ఏమని? దోమలమీద దండయాత్రకు కూలీల సొమ్ము వినియోగ పరచుట అన్యాయమని, అవినీతి అని. చెవిటివాని చెవిలో శంఖము ఊదినట్లు వారి పలుకులు మేనేజరు చెవి కెక్కా లాయా? వారి మాటలు వింటూడా మన బూర్జా మేనేజరు! యికమీద తనవద్ద మిగిలిన సమ్మెయనే వజ్రాయుధమును ఉపయోగించవలయునని తలచాడు. మరుసటి దినం తెల్ల వారి 'లే, లే' అంటూ ఫాక్టరీ అంతా తిరగబడింది. నిన్ను తీసు కొని రమ్మంటున్నారంటూవచ్చారు రమేష్ మిత్రులు. బయలుదేరినాడు రమేష్. "అబ్బాయీ! నీ వొంట్లో బాగా లేదు. అక్కడున్నవాళ్లు ఏం చేస్తారోఅని చూచుటకు కుతూహలంగావుంది. నేనూ వస్తా" నని బయలు దేరింది ముసలి తల్లి. రమేష్ ననుసరించారు మిత్రులగు సులోచన, శశాంక.

మిల్లు దగ్గరకూడినారు వేలకువేలు కార్మికులు ఆడ, మగ విచక్షతలేకుండ. వీరు సోషలిస్టులు, వీరు కమ్యూనిస్టులు అని వేరుపరచుటకు వీలులేకుండయున్నారు. ఒక పార్టీ ఏమిటి. అన్ని పార్టీలు భావగర్భితాలైన గీతాలు "ఇంక్విలాబ్ జిందా బాద్ "అధికారుల అన్యాయాలు నశించాలి, కూలీల కష్టాలు నశించాలనే" నినాదాలు. ఆ దృశ్యం చూచిన ప్రతి మానవునికి ఒళ్లు గగుర్పాటు చెందవలసినదే.

శశాంక, సరోజనిదేవిలాగా చెప్పుటకు మొదలెట్టింది. "సోదరులారా! ఒక రాగి నాణెము కొరకు కాదు మన పట్టు దల. న్యాయంకోసము. న్యాయంకోసము మనమంతా కట్టు కట్టాలి మనం గడించే రాగి నాణెములు ఫ్యాక్టరీ యజ మానులు పొందే వెండినాణ్యములకంటె ఎక్కువ. ప్రొద్దునే లేస్తాము. సాయంత్రమువరకు చెమటూడ్చి కాయకష్టము చేసి రక్తము ధారపోసి సంపాదించేవి, మన నాణ్యములు. అమీరులులా విలాసముగ బొజ్జ కదలకుండా అలసటలేక సంపాదించునవి ఆ వెండినాణెములు. చిన్నపని మొదలుకొని పెద్ద పనివరకు చేసేది మనము. గుండుసూదులు మొదలుకొని మిల్లు యజమానులకు లక్షలు, లక్షలు సంపాదించి పెట్టే యంత్రములు మనము చేసేవి. కార్మికుడు కృషీవలుడు లేకపోతె జగము తకుముకుకాగలదు. చాకిరి చేయుటకు ముందు మనము. అనుభవమునకు మాత్రము ఆఖరు చెయ్యి మనది" అని వేదిక దిగింది. రమేష్ చెప్పుటకు ప్రారంభించి నాడు "సోదరులారా! మన ప్రాథమిక హక్కులకుకోసము పోరాడడానికి మనము దృఢమైన నిశ్చయము చేసుకోవాలి.

అందరూ ఒక కుటుంబములోని సోదరులలాగు సంచరించాలి. ఆలాగున కాని మన జీవిత స్థితి బాగుపడదు. అందరకు పరమావధియైన లక్ష్యము కొఱకు ఐశ్వర్యమును పెంపొందించాలి. మన కూలివల్ల విలాసముగ జీవనము చేసే దురాశాపరుల తంత్రాలను పరిమార్చుటకు కట్టుకట్టవలసిన సమయము వచ్చినది. ఆత్మ సంరక్షణకిదే తరుణము. మనకి మనమే సాయ పడాలి కాని యింకెవ్వరు సాయపడేవారు లేదు. మన ప్రతి పక్షాలను అణగ ద్రొక్కాలంటే మనమందరము ఒక సిద్ధాంతమునే అనుసరించాలి. అందరికి ఒకటే. అంతా ............అని చెప్పుతూండగా వచ్చారు పోలీసువారు. గుంపును చెరదగొట్టారు. తీసుకొని వెళ్లారు రమేష్‌ను శ్రీకృష్ణ జన్మ స్థానమునకు. న్యాయమునకు కాలము కాని కాలము.

సమ్మె విజయవంతముగా జరుగుచున్నది. కాని సమ్మెచేయుటవల్ల జీవనోపాధిలేక కొందరు మృత్యుదేవతకు బలియైనారు. 15 రోజుల తర్వాత ఆఖరు రాయబారం తీసుకొని పోదలచినారు కార్మికులంతా. బయలుదేరారు. కార్మికులు గుంపులు గుంపులుగా జెండాలతో నినాదాలతో ఆవేశ పూరితమైన కేకలతో మిల్లుచుట్టు మూగినారు. చూచాడు, ఇదంతా మన మేనేజరు సాబ్. ధైర్యంవదిలాడు. పిలిపించాడు సిపాయిదండును. రమేష్ కుడి భుజము అగు శశాంక కార్మికులు అంతా స్వాతంత్ర్య సమరములో ముందుకు సాగి పోతున్నారు.

శశాంక జండా ఎత్తుకొని అపర 'జోన్ ఆఫ్ ఆర్క్' వలె ఎచ్చట చూచిన తానై భారత రణరంగంలో కనుపడు అభిమన్యునివలె కార్మికులలో తిరుగుచున్నది. ఎక్కువైంది మిలటరీవాళ్ల అలజడి. శశాంక యిట్లు చెప్పుటకు మొదలిడినది. "సోదరులారా! సిపాయిలు మాత్రమెవ్వరు. వాళ్లు కూడా మనలాంటి ప్రజలే. వాళ్లు మనలను కొట్టరు. వాళ్లెందుకు మనలను కొడ్తారు? అందరికి శ్రేయస్కరమైన సత్యాన్ని ప్రకటిస్తున్నందుల కేనా? మనము ప్రకటించే ధర్మము వాళ్లకికూడా కావలసినదే. ప్రస్తుతము వాళ్ల సంగతులు వాళ్లు తెలుసుకోలేక పోవచ్చును. వాళ్లుకూడా తమస్థితిని తెలుసుకొని మనతో పాటు స్వేచ్ఛాపతాకము క్రిందికి నడచేరోజులు అచిర కాలములోనే వస్తాయి. ఎన్నో నాళ్లు వాళ్లు హంతకుల యొక్క, అసత్యవాదులయొక్క జండాక్రింద వుండలేరు. మన మెవ్వరమో, మనఆదర్శాలేమిటో, బహిరంగంగా తెలుప డానికి నిశ్చయించుకొన్నాము. సత్య సమ్మతమైనట్టి, ధర్మ సమ్మతమైనట్టి మన ఈ పతాకాన్ని రమేషు ఎగురవేయ వలసినది. కాని ఈ నాడు యినుప ఊచలలోనున్నాడు." అని చెప్పి జండాను ఎగురవేసింది శశాంక. తరువాత, "సోదరులారా! ఆశాపూరితమైనట్టి, అంధకారమైనట్టి, హింసాసహితమైనట్టి యీ అసహ్యజీవితాన్ని వదిలివేయ వలసిన రోజువచ్చింది. ఈజీవితమే మన ఆత్మను మనలోని మానవత్వాన్ని నశింపజేసి, ఈ ప్రపంచములో స్థానము లేకుండా చేసింది. యిటువంటి నిర్భాగ్యపు బ్రతుకును ఒక గొప్ప ఆదర్శము కోసము తృణప్రాయముగా వదిలి పెట్టివేసే కాలము వచ్చింది." అన్నది. జనసమ్మర్దము ఎక్కువైనది. మిలటరీ అదుపు ఆజ్ఞలో పెట్టలేకపోయినారు. "ఏయ్, జండా క్రిందికి దింపివేస్తావాలేదా?" అని గద్దించాడు ఒక మిలిటరీ సిపాయి. కాని ఆవేశపూరితులైన కార్మికులు ఈ మాటతో పిచ్చెత్తి పోయినారు. ఏబావుటా లక్షోపలక్షల కార్మికుల చిహ్నమో, ఏ జండా చమటూడ్చి, రక్తము ధారబోసి జీవనము చేయువారికి గుర్తో అట్టి జండా కొఱకు ప్రాణమిచ్చుటకు సంసిద్ధులైన కార్మికులకు, మిలటరీ దండుకి జరిగింది ఘర్షణ. కురిపించినారు గుండ్ల వర్షము.

గుండ్ల వర్ష ఫలితముగా శశాంక తనప్రాణం వదిలింది. పేదకార్మికులకై అసువులుబాసిన శశాంకకోసం కార్మికుల కన్నీటి కాలువ ప్రవహించింది. ఆమె బలిదానానికి కార్మికుల చిత్తాలు కలగిపోయినవి. కానివారిపై అధికారంచలాయించే ధనికవర్గాలకో.........